శివరాత్రి రోజున అయినా మనస్సుతో, ఇంద్రియాలతో శివుడిని కౌగిలించుకోండి, శివుడిని చుట్టుకొని ఉండండి. అలా శివుడిని చుట్టుకొని ఉంటే ప్రారబ్దం కొట్టే దెబ్బలు ఏవైనా ఉంటే అవి మీకు తగలవు, ఆయనకు తగులుతాయి, మీరు ఈరకంగా జీవిస్తూ ఉంటే ఆయన దయకు పాత్రులవుతారు,, ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు. ప్రారబ్దం దేహానికే, దేహంతో తాదాప్యం లేకపోతే ప్రారబ్దం నిన్ను ఏమీ చేయలేదు, నీ దగ్గర ప్రారబ్దమే ఓడిపోతుంది. కనీసం ఈ శివరాత్రి రోజున అయినా మీ డబ్బు గొడవ, యశస్సుగొడవ, కుటుంబం గొడవ వదులుకొని, ఈ పిచ్చిగొడవలకు దూరంగా ఉండమని, శివుడిని స్మరించుకోమని పెద్దలు చెపుతున్నారు. శివుడిని స్మరించగా, స్మరించగా జీవుడు బంధంలోనుండి విడిపోతాడు ఎవడి మనస్సులో అయితే మినహాయింపులులేని ప్రేమ శివుడివైపు ప్రవహిస్తోందో వాడు శివానుగ్రహం వలన ముక్తిని పొందుతాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 29-2-04, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవదనుభవం పొందటానికి మనం ఒకే మార్గంలో ప్రయాణం చెయ్యాలని ఏమీలేదు. భక్తిమార్గం, ధ్యానమార్గం, కర్మమార్గం ఇలా అనేక మార్గాలను భగవంతుడు చెప్పాడు. అన్ని మార్గాలు మంచివే, అన్ని మార్గాలను సమన్వయం చేసుకొని పొందవలసిన వస్తువునుపొందాలి. అజ్ఞానంలోనుండి జ్ఞానంలోనికి, చీకటిలోనుండి వెలుగులోనికి వెళ్ళమని, శరీరానికి మరణం రాకముందే అమృతానుభవం పొందమని ఉపనిషత్‌లలో చెప్పారు. బ్రహ్మాం అంటే జ్ఞానం, సత్యం, అనంతం, ఆనందం అని ఉపనిషత్‌లలో చెప్పారు. ఆనందం అంటే అది అలౌకికఆనందం కాదు, ఏదో కారణాలవలన వచ్చే ఆనందంకాదు, ఏదో రోజు చనిపోయే శరీరంతో ఉన్న తాదాప్యంలో వందోవంతు మన హృదయంలో ఉన్న మరణంలేని వస్తువుతో తాదాప్యం మనకు లేదు ఇది దురదృష్టకరం. ఈ చనిపోయే శరీరం మీద మనకు ఉన్న ఇష్టం, దీని కోసం మనం పడే ప్రాకులాటలోకొంతైనా లోపలఉన్న సద్వస్తువుతో తాదాప్యం పొందటానికి మనం ప్రయత్నం చేయటంలేదు దీనికి కారణం మనకు పూర్వపుణ్యంలేదు, ఈశ్వరుని పాదాలయందు భక్తిలేదు. మన హృదయంలో ఉన్న మరణంలేని వస్తువుతో తాదాప్యం పొందటానికే ఈ జ్ఞానయాజ్ఞాలు. మనం చిల్లర విషయాల దగ్గరే ఆగిపోతున్నాము. ఈపూజచేస్తే పుణ్యం వస్తుంది, ఈయజ్ఞం చేస్తే స్వర్గలోకానికి వెళతాము అని పుస్తకాలలో చెపుతున్నారు. ఇక్కడే మనం ఆగిపోతున్నాము. ఇవన్నీ తాత్కలికవిషయాలు. వీటిలోనుండి నీబుద్ధిని తప్పించాలి. గుణాలు నిన్ను పీడుస్తున్నాయి,



గుణాల నుండి బయటకువచ్చి గుణరహితుడవు ఎప్పుడు అవుతావు. మాయ అంతా తమోగుణం, రజోగుణం, సత్వగుణం ఈ మూడు గుణాలలో ఉంది. ఈ గుణాల నుండి విడుదల పొందకపోతే నీవు మృత్యువును దాటి అమృతత్వంను పొందలేవు. మనం ఎవరిమీద అసూయ పెట్టుకోకూడదు. అసూయ పెట్టుకొంటే మనకు ఆరోగ్యంరాదు, అనారోగ్యం వస్తుంది, దారిద్ర్యం వస్తుంది. భగవంతుడు అందరి హృదయాలలో ఉన్నాడు. అందుచేత ఎవరిమీద అసూయ పెట్టుకోవలసిన పనిలేదు.

దైనందినజీవితంలో మనప్రవర్తన ప్రేమగా, శాంతిగా ఉండాలి అంతేగాని అశాంతిగా ఉండకూడదు. ఏది నిత్యం ఏది అనిత్యం, మనం ఎలా ప్రవర్తిస్తే మరణానంతరం వెలుగులోనికి వెళతాము దాని తాలూక వివేకాన్ని పెంచుకోవటమే జ్ఞానయోగం. ఎవరిని మనం అనుసరించకూడదు. భగవంతుడిమాటను ప్రయాణంగా తీసుకోవాలి. ఎవడైతే భగవంతుడి మాటను ప్రమాణంగా తీసుకొని జీవిస్తున్నాడో వాడు గుణరహితుడు అవుతాడు, జీవితానికి మరణానికి బేధంలేనిస్థితికి ఎదిగివెళ్ళిపోతాడు. ఈశ్వరుని దయ ఉంటే మన బుద్ధిలో ఉన్న వంకరలు అన్నీపోతాయి. భగవంతుడి పట్ల గౌరవం కలిగిఉండటం, భగవంతుని పాదాలను ఆశ్రయించటం భక్తియోగం. భక్తుడికిరాయి శివుడిగా కనిపిస్తుంది. భక్తిలేనివాడికి శివుడు రాయిగా కనిపిస్తాడు, అది చూసే దృక్పథంబట్టి ఉంటుంది. భగవంతుడు చెప్పిన మాటను హృదయపూర్వకంగా స్వీకరించాలి, ఇష్టాయిష్టాలు తగ్గించుకోవాలి. ఫలాపేక్ష లేకుండా నీవుపనిచెయ్యి, వచ్చేది ఏదో వస్తుంది, రానిది ఏదోరాదు, కర్మయోగం అంటే కర్మను యోగంగా చెయ్యి. నువ్వు చేసే కర్మఎలాగ ఉండాలంటే, అది నీకు లోచూపును కలుగజేయాలి, నీ బుద్ధిశుద్ధి అవ్వాలి. ఇప్పుడు మనం భగవంతుడిలోనే ఉన్నాము. లోపల ఈశ్వరుడు లేకుండా ఈశరీరంరాదు. మీ నామరూపముల మీద మీకు ఎంత ఇష్టం ఉందో అంతఇష్టం లోపలఉన్న ఈశ్వరుడిమీద ఉంటే మీరు మాయలోనుండి బయటకు వచ్చేస్తారు. ఈశ్వరునియందు సజీవమైన విశ్వాసం ఉన్నవాడు ఆయన మాయలోనుండి బయటకు వచ్చేస్తాడు. నీకు వచ్చే ప్రతీతలంపు, నీవు చేసే ప్రతీ పని, నీకు వచ్చే ప్రతీ ఆలోచన నన్ను పొందాలనే లక్ష్యంతో ఉంటే నా మాయలోనుండి బయటకు వచ్చేస్తావు.

జపం చేయటంవలన, ధ్యానం చేయటంవలన అక్కరలేని తలంపులు ఆగిపోతాయి, రాగద్వేషములు తగ్గుతాయి, మన మనస్సు భగవంతుడి వైపు తిప్పబడుతుంది. అసలు వస్తువు పూజలకు, జపాలకు, ధ్యానాలకు, ఈ జననమరణాలకు అతీతం. కాని జపం చేయటంవలన, ధ్యానం చేయటంవలన పూర్వజన్మలో నుండి వచ్చినదోషాలు, నీ బుద్ధిలో ఉన్న వంకరలు అన్నీపోతాయి, బుద్ధికి నిదానం వస్తుంది. ఈజన్మలో నీవు చేసిన పూజలు,

జపాలు, సత్కర్మ మరణానంతరం నీకూడావచ్చి రాబోయేజన్మలో నీకూడా ఉండి నీకు జీవన్ముక్తస్థితిని కలుగజేస్తాయి నీవు ఎవరికైనా సహాయసహకారములు అందిస్తూ ఉంటే ఆమంచిని నీకే ఇచ్చేస్తాను, నాకు ఏమీ అక్కరలేదు, ఆఫలితాన్ని నీకే ఇచ్చేస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు. తమోగుణం, రజోగుణం తగ్గించుకొంటూ సత్వగుణాన్ని పెంచుకొంటూ ఉంటే అది మనలో ఉన్న శుద్ధసత్వాన్ని పొందటానికి మనకు సహకరిస్తుంది. ప్రారబ్దాన్ని బట్టి ఈదేహం వచ్చింది, ఆప్రారబ్దం అయిన వెంటనే అది మరణిస్తుంది. దేహం జడం, దానిమీదఉన్న ప్రీతి కూడా నీకు నావాక్యం మీదలేదు అని భగవంతుడు అంటున్నాడు. గాఢనిద్రలో మనం ఏదిగా ఉండాలో అదిగా ఉంటున్నాము, అక్కడ ద్వైతంలేదు. నరసాపురం నుండి జిన్నూరు వస్తున్నారు అనుకోండి, పాలకొల్లు వచ్చి ఆగిపోయి అదే జిన్నూరు అని అనుకోకూడదు, మనం పూజలు, జపాలు, ధ్యానాలు చేసుకోవచ్చు కాని మనం పొందవలసింది అద్వైతానుభవం. బాహ్యకారణాలతో సంబంధం లేకుండా, ఇంద్రియాలతో మనస్సుతో సంబంధంలేకుండా స్వతంత్రమైన ఆనందాన్ని మనం పొందాలి, అదే మన గమ్యం, కాని మధ్యలో అదే ఇది అనుకొని ఆగిపోతే మన ప్రయాణం ఆగిపోతుంది. అజాగ్రత్తగా ఉంటే ప్రమాదంలో పడతాము. చిత్తశుద్ధిలేకుండా, భగవంతుని యందు ప్రేమలేకుండా మాయనేనులో నుండి విడుదల పొందలేము. ఒక చిన్న బీజం పెరిగి పెరిగి మహావృక్షం అవుతుంది. అలాగే ఈ నేను అనే తలంపు ఈ సృష్టికంతటికి బీజం. ఆ బీజాన్ని మాడ్చేయగలిగితే, మాడ్చేసిన విత్తనం భూమిలో పాతిపెట్టినా ఎలా మొలకెత్తదో అలాగే ఈ శరీరంలో ఉండగానే శరీరంతో తాదాప్యం పొందే నేనుఅనేతలంపు అనే బీజాన్ని మాడ్చేయగలిగితే వాడికి పునర్జన్మలేదు.

లోకంలో ఏదో ఉంది అని అనుకొంటున్నాము. లోకంలో ఉన్నది దుఃఖం, అశాంతి. శరీరాలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. నీకు శరీరం వచ్చిందంటే ఆశరీరాన్ని, మనస్సును సద్వినియోగం చేసుకొని గెడపను ఎంత తేలికగా దాటతావో అంత తేలికగా మృత్యువును దాటి అమృతత్వాన్ని పొందు అని భగవంతుడు చెపుతున్నాడు. నీవు పూజచేసుకో, ధ్యానంచేసుకో, నీకు నచ్చిన మార్గంలో ప్రయాణం చెయ్యి కాని గమ్యాన్ని మాత్రం మర్చిపోవద్దు. శరీరం పుట్టింది, ఆత్మపుట్టలేదు. ఏదైతే పుట్టలేదో అది నీవై ఉన్నావు. పుట్టిన శరీరం నీవు కాదు. అది నీవు కానప్పడు దానితో చూసేదిగాని, వినేది గాని ఏమీలేదు. బాహ్యఆకర్షణల నుండి నీ మనస్సును మళ్ళించి, దానికి లోచూపును కలుగజెయ్యి. భగవంతుడు నీలో అంతర్యామిగా ఉన్నాడు. ఆయన ఇంద్రియాలకు అతీతుడు, మనస్సుకు అతీతుడు. ఇంద్రియాలకు అతీతమైన వాడిని నీకళ్ళతో ఎలా చూడగలవు. మనస్సుకు అతీతమైన వాడిని



నీ మనస్సుతో ఎలా పట్టుకోగలవు. ఒకవేళ నీ మనస్సుతో చూస్తే నీ మనస్సు ఎంత నిజమో, మనస్సుతో చూడబడే వస్తువు కూడా అంతే నిజం. మీరు సబ్జక్టును ప్రోపర్‌గా అర్థం చేసుకొంటే ఇప్పడే ఇక్కడే శాంతిలో, ఆనందంలో  ఊగిసలాడతారు, శరీరానికి మరణం వచ్చినా మీకు ఎర్రచీమ కుట్టినట్లుగా కూడా అనిపించదు. ఎప్పడూ ఉండేది నువ్వే అనే అమృతానుభవం నీవు పొందినప్పడు శరీరంపోతూఉన్నా ఏదోపోతోంది ఇంక మనం ఉండవేమో అని నీకు అసలు అనిపించనే అనిపించదు. అట్టిస్థితిని ఇప్పడే ఇక్కడే ఈజాగ్రదవస్థలో ఉండగానే నీవు పొందటానికి ప్రయత్నించు. భగవంతుడుచెప్పినమాట ఏదో ఒక కాలానికి పనికి వచ్చేదికాదు, అన్నికాలాలలో, అన్నిఅవస్థలలో పనికివస్తుంది. భగవంతుడు అంతటా ఉన్నాడు. అన్ని కాలాలలో ఉన్నాడు, అన్ని అవస్థలలో ఉన్నాడు, మనకు మెలుకువ వచ్చాక బాగా నిద్ర పట్టింది అని చెపుతున్నాము. అక్కడ నీ మనస్సులేదు, ఇంద్రియాలులేవు. శరీరంలేదు. గాఢనిద్రలో నీనిద్రను ఎవడైతే చూస్తున్నాడో వాడు జాగ్రదవస్థలో కూడా ఉన్నాడు అందుచేతనే రాత్రి బాగా నిద్ర పట్టింది అని చెప్పగలుగుతున్నావు లేకుంటే చెప్పలేవు. శరీరం యొక్క జనన మరణాలు చాలా స్వల్పవిషయాలు, నీ సాధనను నా మీద గురిపెట్టటంలేదు. ఈ పనిచేస్తే ఆపుణ్యం వస్తుంది, ఆపుణ్యం వస్తే స్వర్గలోకానికి వెళ్ళవచ్చు అని ఇలా ఆలోచిస్తూ ఈ గొప్పమానవజన్మను, ఈ అవకాశాన్ని ఇలా చిల్లరవిషయాలకు ఖర్చుపెడుతున్నావు అంటున్నాడు భగవంతుడు.  నీవు ఎంత గొప్పలోకాలకు వెళ్ళినా నీమనస్సు ఎంత నిజమో ఆలోకాలు కూడా అంతే నిజం. మనకు దూరదృష్టిలేదు. ఈ పనిచేస్తే ఆపుణ్యం వస్తుంది అనుకొంటున్నావు, మరల అది అనుభవించటానికి శరీరం రావాలి, మరల ఆ శరీరం ఏదో రోజు మరణిస్తుంది. ఇదేనా నీగమ్యం, వీటికోసమేనా నీ ప్రయత్నం, అంతకంటే గమ్యంలేదా నీకు? ఉన్నది బ్రహ్మం ఒక్కటే, నీవు ఏమార్గంలో ప్రయాణం చేసినా దానిని పొందటమే లక్ష్యంగా పెట్టుకో, దానికోసమే జీవించు, దానికోసమే తపించు, దానిని పొందటానికే ప్రయత్నించు, మధ్యలో ఆగిపోవద్దు, ఇతరులను అనుసరించవద్దు, గమ్యాన్ని మర్చిపోవద్దు.

ఓం భోజనాయనమః నీకు ఇష్టమైన పదార్థాలు రుచిగా, శుచిగా, వేడిగా, ఎంతో ప్రేమతో పెట్టినప్పడు ఎంత బాగుంది ఎంత బాగుంది అని ఎంజాయ్ చేస్తూ నెమ్మదిగా తింటూ వాటిని ఎలా అనుభవిస్తామో అలాగ భగవంతుని కళ్యాణగుణాలను, ఆయన అనంతత్వాన్ని ఎంజాయ్ చేస్తూఉంటే, అనుభవిస్తూ ఉంటే ఆయన మనకు గోచరిస్తాడు. మనకు తెలివితేటలు ఉండవచ్చుగాని అతితెలివి పనికిరాదు. మన తెలివి మనకు ఉపయోగపడాలి, సమాజానికి ఉపయోగపడాలి, భగవదనుభవం పొందటానికి అది నీకు

సహకరించాలి, లేకపోతే ఆ తెలివిని ఏమి చేసుకొంటావు. ఇష్టమైన పదార్థాలు తినేటప్పుడు ఎలా ఉంటున్నావో సాధన చేసేటప్పుడు కూడా అలా ఉండాలి. మనస్సు వెళ్ళి హృదయంలో లయమవ్వాలి. అంతఃకరణశుద్ధిలేకుండా మనస్సు హృదయంలో లయమవ్వదు. హృదయం ఎంత పవిత్రంగా ఉందో అలాగ నీ మనస్సు అంత పవిత్రం అయితే మనస్సు హృదయంలో లయమవుతుంది. కేవలం అన్నం తినటానికి, బట్టలు కట్టుకోవటానికి ఈలోకంలోనికి రాలేదు, అంత:కరణశుద్ధిని సంపాదించుకోవటానికి వచ్చాము. వచ్చినపనిని మర్చిపోవద్దు. నీ అంత:కరణం ఎప్పుడైతే శుద్ధి అయ్యిందో అది దానిమూలంలో లయమవుతుంది, అప్పుడు నీకు సత్యం గోచరిస్తుంది, జీవితగమ్యం అదే. గుణాలు, ఆ గుణాలు ప్రేరేపించే విషయాల నుండి బయటకురావాలి నీవు గుణరహితుడవు అవ్వాలి. గుణాల నుండి బయటకు రావు అనుకో జననమరణచక్రంలో నుండి బయటకు రాలేవు. నీవు జ్ఞాననిష్టలో ఉండాలి, నీవు చేసేపని భగవదనుభవం పొందటానికి నీకు సహకరించాలి. నేను చనిపోతున్నాను అనుకొనేవాడు ప్రతీవాడు పుడతాడు, నేను పుట్టాను అనుకొనేవాడు ప్రతీవాడు చనిపోతాడు, ఇది కర్మచక్రం. నీకు అమృతానుభవం కలిగేవరకూ ఇలా కర్మచక్రంలో కొట్టుకొనిపోతూ ఉంటావు. నీ బుద్ధిలో కల్మషం పెట్టుకొని, నీ బుద్ధిలో కషాయంపెట్టుకొని, నీబుద్ధిని కలకలం చేసుకొని, కల్లోలం చేసుకొని అందులోనుండి విడుదలపొందకుండా అమృతానుభవం పొందాలి అనుకొంటున్నావు? బుద్ధిలో కల్మషం ఉంటే అదిదాని మూలంలో ఎలా లయం అవుతుంది? లయం కానేకాదు.

స్నేహం అంటే ఏమిటి? స్నేహితుడు అంటే మన దుఃఖాన్ని తగ్గించాలి, మన ఆనందాన్ని పెంచాలి, అంతేగాని మనలో ఉన్న అశాంతిని పెంచేవాడు, మన దుఃఖాన్ని పెంచేవాడు మన ఆనందాన్ని పోగొట్టేవాడు స్నేహితుడుకాదు, వాడు స్నేహితుడి రూపంలో ఉన్న పిశాచం. నీ చేతిలో ఉన్న పనిని జాగ్రత్తగా చేసుకొంటూవెళ్ళు. అది నెరవేరుతుందా, నెరవేరదా అని అనుకోవద్దు. ఏమీ అనుకోకుండా ఉండు, అప్పుడు మనస్సు వెళ్ళి గూటిలో పడిపోతుంది. అనుకోవటాలే సంస్కారములుగా మారిపోతున్నాయి. చైతన్యం ఏమీ అనుకోదు, వారు ఉంటారు అంతే, నీవు ఏమీ అనుకోకు అప్పుడు ఆ ఉన్నవారిలో నీవు ఐక్యమయిపోతావు. నీవు చేసే ప్రతీపని యోగివి అవ్వటానికి చెయ్యి. సమానబుద్ధిని సంపాదించు, భగవంతుడు లోపల ఎంత సమానంగా ఉన్నాడో, ఎంత సహజంగా ఉన్నాడో నీ బుద్ధి కూడా అంత సమానంగా, అంత సహజంగా అయితే అందులో ఐక్యమయిపోతుంది, ఏదేహం అయితే శవం అవుతోందో అదే ఆత్మ అనుకొని, అదే సర్వస్వం అనుకొని, అదే సత్యం అనుకొని, అదే నువ్వు అనుకొని 100 సంవత్సరాలు దానికోసమే జీవిస్తున్నావు. జీవితం పొడుగునా



దానికోసమే ఆలోచిస్తున్నావు. అదా నిన్ను ఉద్ధరించేది? ఆ శరీరాన్ని ఉపయోగించుకొని దేనిని పొందాలో మర్చిపోయావు, అదే మాయ, ఎవరిమీద అయినా కోపం పెట్టుకొన్నా, ఇష్టాయిష్టాలు పెట్టుకొన్నా ఈశవం కోసమే పెట్టుకొంటున్నావు. శరీరం పెరుగుతుంది, అది ఏదో రోజు మరణిస్తుంది. శరీరం మరణించటంలో విశేషంలేదు, అది సహజం. అది నీవు అనుకోకుండా, ఏదైతే నీవో దానిని తెలుసుకోవటానికి ఈ శరీరాన్ని ఉపయోగించుకో. జీవితం పొడుగునా తపించేవారికి, జీవితం పొడుగునా ఇతరులకు సహాయసహకారములు అందించేవారికి, జీవితం పొడుగునా వారు కాలిపోతూ ఇతరులకు వెలుగునిచ్చే వారికే అమృతానుభవం పొందటం అనేది దూరంగా కనబడుతోంది. ఏదోకొద్ది రోజులు ట్రైనింగ్ పొంది అమృతానుభవం పొందాలి అని చూస్తున్నావా? అది ఎలా సాధ్యం? ఏదైతే నేనుఅని ఇప్పుడు నీవు అనుకొంటున్నావో అదికాలిపోకుండా నీకు అమృతానుభవం కలుగుతుందా? అది సాధ్యంకాదు.

ఏ వస్తువులో అయితే దుఃఖంలేదో, ఏ వస్తువులో అయితే వేరుభావన లేదో అది అనుభవంలోనికి వచ్చేవరకు నిన్ను దుఃఖం విడిచిపెట్టదు. మీకు 100 కోట్లు డబ్బు ఉంది అనుకోండి, మీకు దుఃఖం వస్తోంది అనుకోండి. మీరు ఫెయిల్ అయిపోయినట్లులెక్క. ఆ డబ్బు దుఃఖం రాకుండా ఎందుకు ఆపుచేయలేకపోతోంది. సాధన అంటే మన ఇంద్రియాలు, మన మనస్సు చెప్పినట్లు మనం వినటం కాదు, మనం చెప్పినట్లు మన ఇంద్రియాలు, మన మనస్సు వినాలి, వాడు సాధకుడు. వాడికి ఈ జన్మలో కాకపోయినా, రాబోయే జన్మలో అయినా సిద్ధి కలుగుతుంది. నీవు మెచ్చిన భోజనం తినేటప్పుడు దానిని ఎంత ఇష్టంగా అనుభవిస్తున్నావో అంత ఇష్టంగా భగవంతుడి కళ్యాణగుణాలను నీవు అనుభవిస్తున్నావా? అలా అనుభవించటం లేదు అనుకో నీకు ఆత్మజ్ఞానం ఏమిటి? ఈ దేహమే సత్యం, దేహమే ఆత్మ అనుకొన్నంతకాలం కోరికలను ఆపుచేయలేవు. వ్యక్తిభావన వస్తూనే ఉంటుంది. నీవు ఏదైనా మంచి చేసావు అనుకో, నీ సంకల్పం వలన చేయలేదు, భగవంతుడునీద్వారా అది చేయించాడు, నేను చేసాను అని నీవు అనుకోవద్దు, చేయటానికి నీవు అంటూ ఉన్నావా? నీవు లేవు అసలు, కాని నేను చేసాను అనుకొంటున్నావు, అదే కర్తృత్వం, దానిని బట్టే దుఃఖం వస్తోంది, ఉన్నది ఒక్కటే, అది నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు, నేను అంటూ లేను అన్న సంగతి నీకు తెలుస్తుంది.

భగవంతుడు మీకు ఆత్మజ్ఞానం ఇవ్వాలి అనుకొన్నాడు అనుకోండి, మన మీద ఆయనకు దయ కలిగింది అనుకోండి మన బుద్ధిలో ఉన్న కల్మషాన్ని కొన్ని క్షణాలలో తీసేసి, అది బయటకు పోతున్నప్పుడు, అది పోతున్నట్లు మీకు తెలిసేటట్లుగా చేసి, మీ సహస్రారాన్ని

శుద్ధిచేసి మిమ్మల్ని అమృతమయం చేస్తాడు. భగవంతుడికి అసాధ్యమంటూ ఏదీలేదు. విశ్వాసం ఉన్నవాడికి సొమ్ము, విశ్వాసంలేని వాడికి దుమ్ము. ఈశ్వరుడి మీద మీకు పరిపూర్ణమైన విశ్వాసం కుదిరితే, నోటితో భగవంతుడు ఉన్నాడని చెప్పటం కాదు ఆయన మీద, ఆయన చెప్పిన వాక్యం మీద మీకు ప్రమాణబుద్ధి కలిగితే బుద్ధిలో ఉన్న వంకరలు పోతాయి, లోపల తగినంత విశ్వాసం లేకుండా, ప్రేమలేకుండా బాహ్యంగా ఏవో సాధనలు చేసినా వాటివలన ప్రయోజనం లేదు, మనం ఆయనను పొందలేము. బాహ్యంగా మనం చేసే పనులవలన భగవంతుడు మోసపోడు, ఆయన మనకంటే తెలివిగలవాడు. ఆయన యొక్క జ్ఞానంతో పోల్చుకొంటే మన తెలివి ఎంత, మన జీవితం ఎంత? భగవంతుడిపట్ల పరిపూర్ణమైన విశ్వాసం కలగాలి. లోపల అహంభావన పెట్టుకొని మనం పుణ్యకార్యాలు చేస్తూ ఉంటే దానివలన భోగం వస్తుంది, చిత్తశుద్ధి ఉన్నవాడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. చిత్తశుద్ధి ఉన్నవాడు కాలప్రవాహంలో నుండి, కర్మచక్రంలో నుండి, యముడి యొక్క పాశంలో నుండి విడుదలపొందుతాడు.

ఏదైతే నేను అనుకొంటున్నానో ఆ నేనును విడిచిపెట్టటం కష్టంగానే ఉంది, దానిని విడిచిపెట్టలేకపోతున్నాను అని ఒక భక్తుడు అంటున్నాడు. కుండలోపల అన్నం ఉంటుంది. కుండపైన మూత ఉంటుంది. మూత ఉండటం వలన లోపల అన్నం ఉన్నా అది మనకు కనబడదు. అలాగే ఈ నేను అనే తలంపు ఒక మూత. ఈమూత మన హృదయంలో ఉన్న ఆనందాన్ని, వైకుంఠాన్ని మనకు కనబడకుండా చేస్తోంది. ఆ మూతను తీసి ఒక ప్రక్కన పెడదామ అంటే అదే నేను అనుకోవటం వలన ఆ మూతను తీసి ప్రక్కనపెట్టలేకపోతున్నాము. అదిపోతే మనం పోతాము అనుకొంటున్నాము, కాని అదిపోతే మనం పోముసరికదా మనం ఎవరిమో మనకు తెలియబడుతుంది. చిక్కంతా, ముడి అంతా ఇక్కడే ఉంది. ఏదైతే ఉందో దానిమీద నీకు అనురక్తి ఉండాలి, మిగతాది అంతాడస్టు, మీ ఇంట్లో మనుషులు కూడా వారు మీ సొంతం అనుకోవద్దు. వారిని చూడమని భగవంతుడు మీకు వారిని కేటాయించాడు. వారు బతికి ఉండగా మనమైనా వెళ్ళిపోతాము, మనం బతికి ఉండగా వారు అయినా వెళ్ళిపోతారు, కళ్ళుమూస్తే ఒకరికి ఒకరికి ఏమీ సంబంధంలేదు. మన డ్యూటీలో మటుకు లోపం లేకుండా చేయాలి, వారిని ఉద్ధరించటానికి మనం ఎవరము. మన పని మనం చేయాలి, అంతా భగవంతుడే చూసుకొంటాడు. జరగేది ఏదో జరుగుతుంది, జరుగరానిది ఏదీ జరుగనే జరుగదు. ఈశ్వరుడికి మనం వేరుగా ఉన్నాము అని అనుకోవటం వలన మనకు వేదన వస్తోంది. ఈశ్వరుడి సంకల్పమే నా సంకల్పం అనుకొంటే, ఈశ్వరుడి మీద వేరుభావన లేకపోతే వాడు దుఃఖరహితస్థితిని పొందుతాడు.



భగవంతుడు పని చేసుకొంటూ వెళుతున్నాడు, ఈసృష్టిని అంతా నడిపేది ఆయనే ఆయనకు తెలియకుండా ఈసృష్టిలో ఏమీ జరగటంలేదు. నీవు కర్తృత్వం లేకుండా జీవిస్తూ ఉంటే దైనందిన జీవితంలో గర్వంలేకుండా, అతితెలివిని తగ్గించుకొని జీవిస్తూ ఉంటే నీ బాధ్యతను ఆయన స్వీకరిస్తాడు, నీ యోగక్షేమాలను ఆయన చూస్తాడు, నీ గుణాల నుండి విడుదల పొందటమేకాదు, నీ యోగక్షేమముల గురించి నీవు ఆలోచించుకోవటం మానివెయ్యి, నీ గురించి నీవు ఆలోచించుకోవటం మానివెయ్యి. అలాగ అయితే ఎలాగ, నా మాట ఏమిటి అని అంటావేమో నేను ఉన్నాను కదా, అంతా నేను చూసుకొంటాను అని భగవంతుడు చెపుతున్నాడు. నేను ఏదో సాధించాను అని నీవు అనుకొంటున్నావు కాని అది కూడా నేను సాధించి పెట్టినదే. నీ బుద్ధిలో ఉన్న వంకరలు పోయినాయి అనుకో అది అంతా ఈశ్వరుని కృప వలననే జరిగింది అని నీకు తెలియటంలేదు. ఉన్నది ఆయనే, అంతా ఈశ్వరుడే, నీవు ఎవరు? అతితెలివిని ఆపుచెయ్యి. నా మాట ఏమిటి అని నీవు మనస్సులో అనుకోవచ్చు. ఈ లోకాన్ని అంతా చూసేవాడు ఒకడు ఉన్నాడు, ఆయనే నిన్ను కూడా చూస్తాడు, అనుకొనేది జీవుడి సంకల్పం, జరిగేది ఈశ్వరసంకల్పం. ఈ సృష్టినంతా మోసే భగవంతుడు నీ ఒక్కడి బరువు మోయలేడా? నువ్వు ఒక్కడివి ఆయనకు బరువు అయిపోతావా? అయితే నీ భారాన్ని ఆయన మీద వేయలేకపోతున్నావు. నీ భారాన్ని ఆయన మీద వెయ్యటం నేర్చుకొంటే ఆయనే మోస్తాడు. అప్పుడు నీవు 100 సంవత్సరాలు బతికినా 100 క్షణాలుగా నీజీవితం వెళ్ళిపోతుంది. ఈమీటింగు ఎప్పుడు అయిపోతుంది, ఎప్పుడు అయిపోతుంది అని అలాకాకుండా మీకు ఇష్టమైన భోజనం తినేటప్పుడు ఎలా అనుభవిస్తున్నారో అలాగ నా మాటలను ఎంజాయ్ చేయండి. అలా ఎంజాయ్ చేస్తూఉంటే మీకు దొరక్కుండా ఎక్కడకుపోతాను అంటున్నాడు భగవంతుడు, కాని మనం ఆముదం నోటిలో పోసుకున్నట్లు అనుభవిస్తున్నాము ఇంక ఆయన ఎలా దొరుకుతాడు.

ఏ శరీరం అయితే శవం అవుతోందో దానితో తాదాప్యం తగ్గించుకోండి. ఈశరీరం మరణించినా మరణంలేని వస్తువు ఒకటి మన హృదయంలో ఉంది, దానితో తాదాప్యం పెంచుకోవటానికి ప్రయత్నం చేయండి. మీరు ఇటుకాదు జరగవలసింది, అటు జరగండి, అటు ప్రయాణం చేయండి, అప్పుడు మరణాన్ని జయిస్తారు, కర్మచక్రంలో నుండి విడుదల పొందుతారు, మీకు మోక్ష సుఖం లభిస్తుంది. ప్రేమపూరితజీవితం ఉన్నవాడిని, జ్ఞానపూరిత జీవితం ఉన్నవాడిని అమృతస్థితి వచ్చి వరిస్తుంది. మీ జీవితాన్ని అలా మల్చుకొంటే అమృతానుభవం దగ్గరకు మీరు వెళ్ళటంకాదు, అదేవచ్చి మీశిరస్సుమీద పడుతుంది. అందుచేత మీ జీవితాన్ని ప్రేమపూరితం, జ్ఞానపూరితం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 24-04-04 | శని | జిన్నూరు శ్రీ రమణక్షేత్రం శంకరజయంతి సందర్భంగా |
| 03-05-04 | బుధ | పెదఅమిరం వెంకటేశ్వర స్వామి ఆలయంలో |



ది. 14-4-2004 బుధవారం ఉదయం గం॥ 9-30 ని॥లకు

తణుకు, పాలిటెక్నిక్ కాలేజి ఎదురుగా

విన్నకోటవారి వీధిలో

**డా॥ వి.టి. శ్రీనివాస రెడ్డి**

**డా॥ వి. భువనశ్రీ**

లచే నిర్మించబడిన **గీతా హాస్పటల్స్‌ను**

ప్రారంభిస్తున్న

సద్గురు శ్రీ నాన్నగారు

20-4-2004



## కథావశేషులు ఉద్దరాజు ఆనందరాజు గారి 24వ వర్ధంతి సభ

భీమవరం ఏప్రియల్ 13, సభావేదిక : శ్రీ రామకృష్ణ సభాభవనము (డి.యన్.ఆర్.కళాశాల ఆడిటోరియం)

ఆధ్యాత్మిక సంఘం వారు గత 23 సంవత్సరాలుగా **ఉద్దరాజు ఆనందరాజు** గారి వర్ధంతి నిర్వహిస్తూ ఒక ఆధ్యాత్మిక సభ జరిపించి చక్కని సందేశం ద్వారా ఆనందరాజు గారిని జ్ఞాపకంచేస్తూ వస్తున్న సభ. పట్టణ ప్రముఖులు చాంబర్ ఆఫ్ కామర్సు మాజీ అధ్యక్షులు **శ్రీ కనుమూరి స్యతనారాయణరాజు** అధ్యక్షతవహిస్తూ **ఆనందరాజు** గారు **ఉత్తమగృహస్తునిగా** వ్యాపారంలో ధర్మాన్ని కాపాడిన వాణిజ్యవేత్తగా-రైతుగా కష్టపడి ఉన్నతంగా ఎదిగినా నిరాడంబరమైన వ్యక్తిత్వంతో ఆదర్శప్రాయంగా జీవించిన మహనీయునిగా అభివర్ణిస్తు నివాళి సమర్పించారు. ప్రొఫెసర్ **శ్రీ కలిదిండి వెంకట్రామరాజు** గారు **ఆనందరాజు**గారి విశిష్టతను పద్యాలలో వినిపించి సభకు రక్తికట్టించారు. శ్రీమతి **నంబూరి భాస్కరకుమారి** ప్రార్ధనతో ఈ సభ ప్రారంభమైనది. ముఖ్య అతిధిగా విచ్చేసిన **జిన్నూరు సద్గురు శ్రీ నాన్నగారు** రమణ సత్యాన్ని సందేశాత్మకంగా ఎన్నో నిత్య జీవన సత్యాలను సమన్వయంచేస్తూ భగవాన్ రమణ మహర్షి వేదాంతాన్ని సులభంగా చిన్న చిన్న మాటలతో అప్యాయంగా బోధించి భక్తుల హృదయాలను జ్ఞానామృతధారలతో కదిలించారు. **శ్రీ ఉద్దరాజు పద్మనాభరాజు శ్రీనాన్నగారిని, శ్రీ సత్యనారాయణ రాజుగారిని, శ్రీ వెంకట రామరాజు గారిని, శ్రీమతి భాస్కర కుమారి** గారిని శాలువాలతో సత్కరించారు. శ్రీ **చెరుకువాడ వెంకటరామయ్య** స్వాగతాన్నందించారు.

రమణ భాస్కర